ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -227 పేజీలు - 08 వెల - 04/-

బుధవారం 18 జూన్ 2025



## 15 శాతం వృద్ధి లక్ష్యంగా

# ప్రణాళికలు సిద్ధం చేయండి

### ప్రణాళిక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- సేవలరంగం అభివృద్ధితో ఆర్థిక సుస్థిరత
- గ్రామస్థాయిలో కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు
- ప్రధాన నగరాల్లో ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించండి
- అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ పై చర్చ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు రాష్ట్ర సచివాలయంలో ప్రణాళిక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ వంటి అంశాలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఈ సమీక్షలో ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. సంక్షేమానికి వనరులు లభ్యత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థిక సుస్థిరత కోసం సేవల రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలపై విభిన్న మార్గాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అన్నారు. తలసరి ఆదాయంలో ఏడాదిలోనే మెరుగైన ఫలితాలు మంచి పరిణామం అని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలకు మార్గ నిర్దేశం చేయడంలో ప్రణాళిక విభాగం కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు.

2లో



### కుప్పం మహిళ శిరీషను

ఫోన్‌లో పరామర్శించిన చంద్రబాబు.!

రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన....

పిల్లల చదువుకు హామీ.

## ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య

# ముదురుతున్న ఘర్షణ



- ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ బాంబు దాడి
- గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగం
- మధ్యవర్తుల ద్వారా చర్చలకు సిద్ధమంటూనే దాడులు కొనసాగిస్తున్న ఇరాన్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడా పర్యటన అర్ధాంతరంగా ముగింపు



**వాషింగ్టన్: జూన్ 17ఆంధ్ర ప్రగతి:** ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య మొదలైన ఘర్షణలు ఐదోరోజుకు చేరుకోవడంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం హుటా హుటిన కెనడా నుంచి వాషింగ్టన్ తిరిగి వచ్చారు. జీ-7 సదస్సుకు హాజర య్యేందుకు కెనడా వెళ్లిన ట్రంప్ తన పర్యటనను కుదించుకొని ఒక రోజు ముందే స్వదేశానికి చేరుకున్నారు. మిగతాది 2లో...

### గోదావరి-బనకచర్ల వివాదం

## అన్ని పార్టీల ఎంపీలతో నేడు సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు గౌరవ అతిథులుగా ఆహ్వానం
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీలందరికీ లేఖలు, ఫోన్లు చేసిన ప్రభుత్వం
- ఏపీ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీస్తుందని మంత్రి ఉత్తమ్ ఆందోళన



**హైదరాబాద్,జూన్ 17ఆంధ్ర ప్రగతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం నేడు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మిగతాది 2లో...

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల



## ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు: రామానాయుడు

సముద్రంలో కలిసే నీటినే వినియోగించేలా ప్లాన్

2లో

# చెవిరెడ్డి అరెస్టు



- విదేశాలకు పారిపోతుండగా అదుపులోకి
- లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం
- బెంగళూరు ఎయిర్‌పోర్టులో నాటకీయంగా అరెస్టు
- కేసులో 38వ నిందితునిగా చేర్చిన సిట్
- దేశం దాటిపోయేందుకు ప్రయత్నం
- బినామీ వెంకటేశ్‌నాయుడితో కలిసి పథకం!
- శ్రీలంక వెళ్లేందుకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు
- వారిద్దరినీ అరెస్టుచేసిన ఇమ్మిగ్రేషన్ అధికారులు
- నేడు విజయవాడ ఏసీబీ కోర్టుకు..

2లో

# 600 ఫోన్ల ట్యాప్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు
- నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్
- జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్ రావు
- మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు



**హైదరాబాద్,జూన్ 17ఆంధ్ర ప్రగతి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. మిగతాది 2లో...

## నేడు పల్నాడు జిల్లాలో జగన్ పర్యటన

పరిమిత సంఖ్యలో రావాలని పోలీసుల ఆంక్షలు



2లో

## అమరావతికి మరింత జోష్

- రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- 1,458 కోట్లతో ఉమ్మడి కేంద్ర సచివాలయం
- 1,329 కోట్లతో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్స్ కూడా..
- ఐనవోలులో గతంలోనే 17 ఎకరాలు కేటాయింపు
- వీటికి మళ్లీ అక్కడే భూములివ్వనున్న సీఆర్‌డీఏ



2లో

# ప్రణాళికలు సిద్ధం చేయండి

అమరావతిజూన్ 17ఆంధ్ర ప్రగతి:
గతానికంటే ఎక్కువగా ప్రణాళిక శాఖకు తాను ప్రాధాన్యమిస్తున్నట్టు చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి శాఖ మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక శాఖే బాధ్యత తీసుకోవాలన్నారు. రుణ భారం తగ్గించుకోవడం, సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలక అంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు.
పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కెబినెట్ సమావేశాలు, 6 ఎస్ఐబీపీ సమావేశాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడితో ఆగకుండా.. ఆ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా చూస్తున్నామన్నారు.

**సాంకేతికతతో సమాచార విశ్లేషణ**

కచ్చితమైన ప్రణాళికలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం లెక్కల్లో జాతీయ స్థాయికి మించి ఏపీ పురోగతిని సాధించిందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం 8.7 శాతం మేర పెరిగితే.. ఏపీ 11.89 శాతం మేర పురోగతి నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన డేటా అనలిటిక్స్ కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండలాలతో పాటు గ్రామ స్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్ర స్థాయి నుంచి పోటీతత్వం పెరుగుతుందన్నారు. 2028-29 నాటికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అభివృద్ధి సూచికలే కీలకం**

నెలవారీ అభివృద్ధి సూచికల ద్వారా ఎప్పటికప్పుడు పనితీరును సమీక్షించుకునే అవకాశం ఉంటుందని



సీఎం చంద్రబాబు సూచించారు. దీని వల్ల ఎప్పుడైనా లోటుపాట్లు ఉంటే తక్షణం సవరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రిజర్వాయర్లు, నేలలో తేమ శాతం, భూగర్భ జలాల వివరాలు వంటివి నమోదు చేసి వివరాలు తీసుకునే బాధ్యతను ప్రణాళిక శాఖ తీసుకోవాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటల్లో గ్రాస్ వాల్యూ ఎడిషన్ తో పాటు సేవల రంగంలో పెట్టుబడులు పెరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోలు ధరలు తగ్గించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయనే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు సూచించారు. పీ-4లో బంగారు కుటుంబాలు-మార్గదర్శుల మధ్య సమన్వయం చేసుకునే ప్రక్రియను ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**మెరుగ్గా ప్రజాభిప్రాయ సేకరణ**

ప్రభుత్వ సేవలు, విభాగాల పనితీరు మీద నిరంతరం ప్రజాభిప్రాయం తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ప్రభుత్వానికి చేరేలా పీపుల్ పాజిటివ్ పర్సెప్షన్ వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్, క్యూఆర్ కోడ్ విధానాల ద్వారా ప్రస్తుతం చేపడుతున్న అభిప్రాయ సేకరణతోపాటు.. మరిన్ని భిన్నమైన మార్గాల ద్వారా కచ్చితమైన సమాచారం రాబట్టేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సహా ప్రణాళిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కుప్పం మహిళ శిరీషను ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.!

చిత్తూరు జిల్లా ,కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమె చెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి...అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు ఫోన్‌లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సియం అధికారులను ఆదేశించారు.

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల

## ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు: రామానాయుడు

అమరావతి జూన్ 17ఆంధ్ర ప్రగతి:
గోదావరి వరదల వల్ల ఎపికే ఎక్కువ నష్టం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసమే కేంద్రానికి లేఖ రాశాం అని అన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోతున్న ఎపికి.. నీళ్లు ఉపయోగించుకునే హక్కుఉందని చెప్పారు. గోదావరి నీళ్లు నిరుపయోగంగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎగువ నీటి అవసరాలు తీరిన తర్వాతే బనకచర్లకు నీళ్లు వృథాగా పోతున్నాయని ఆ నీళ్లనే బనకచర్లకు వాడుకుంటాం అని తెలియజేశారు. రాజకీయ లబ్ది కోసమే బనకచర్లపై వైసిపి విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదని అన్నారు. బనకచర్లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టుపై అనుమానాలు అవసరం లేదు అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆయన సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని ఆయన వివరించారు. 'ప్రపంచంలోనే ఒక నదిలో ఒకే సమయంలో 50 లక్షల క్యూసెక్కులు ప్రవహించే నది గోదావరి. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే ఉపయోగించుకుంటాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మాత్రమే బనకచర్లకు తరలిస్తాం. ఎక్కడా నికర జలాలను వాడట్లేదని స్పష్టంగా చెబుతున్నాం. ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళు_గా గోదావరి నీరు వృథాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీ అని విమర్శలు చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించు కోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు.దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సార్ఎస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

# చెవిరెడ్డి అరెస్టు

అమరావతి, బెంగళూరుజూన్ 17ఆంధ్ర ప్రగతి:
రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో మరో కీలక సూత్రధారి, మాజీ సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. విదేశాలకు పరారవుతుండగా చెవిరెడ్డిని అత్యంత నాటకీయంగా బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడకు తరలించారు. బుధవారం ఏసీబీ కోర్టులో వైసీపీ నేతను ప్రవేశపెట్టనున్నారు. లిక్కర్ కేసు దర్యాప్తులో భాగంగా ఒక్కొక్క అనుమానితుడిని పిలిచి సిట్ అధికారులు విచారించడంతో మద్యం ముడుపులతో చెవిరెడ్డికి ఉన్న లింకులు బయటికొచ్చాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కేసులో 38వ నిందితునిగా చేర్చారు. దీంతో అరెస్టు తప్పదని భావించిన ఆయన, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన తన మిత్రుడు, బినామీ వెంకటేశ్‌నాయుడుతో కలిసి పక్కా పథకం రచించారు. ఇద్దరూ విదేశాలకు పరారయ్యేందుకు సిద్ధమయ్యారు. ముందు శ్రీలంకకు వెళ్లి అటు నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోయేందుకు రహస్యంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ముందే ఈ విషయం పసిగట్టిన సిట్ అధికారులు చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడులపై ఎల్‌వోసీ (లుకౌట్ నోటీసు) జారీ చేసింది. ఈ విషయం తెలియని చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడు తమ పథకంలో భాగంగా మంగళవారం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎయిర్‌పోర్టులోనే వారిద్దరినీ నిర్బంధించి ఏపీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిట్ అధికారుల బృందం బెంగళూరుకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకుంది.గత ఎన్నికల్లో తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి అప్పటి అధికార వైసీపీ మద్యం ముడుపులను వాడినట్టు సిట్ గుర్తించింది. ఎన్నికల సందర్భంగా రూ.ఎనిమిది కోట్లు ప్రకాశం జిల్లాలోని ఒక అసెంబ్లీ అభ్యర్థికి ఇచ్చేందుకు తీసుకెళు_ండగా ఈసీ పట్టుకుంది. అప్పట్లో ఆ డబ్బులను సీజ్ చేసిన తహశీల్దారు మొదలుకొని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వాహన డ్రైవర్, గన్‌మ్యాన్, వ్యక్తిగత సహాయకుడి వరకు అందరినీ పిలిపించి సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆ రూ.8 కోట్లు తనవంటూ అప్పట్లో చెవిరెడ్డి మిత్రుడు, బినామీ వెంకటేశ్ నాయుడు ఆధారాలు చూపించి వెనక్కు తీసేసుకున్నారు. అవి లిక్కర్ ముడుపులేనని తాజాగా తేలడంతో వెంకటేశ్‌నాయుడిని సిట్ విచారించింది. ఆయనను ఈ కేసులో 34వ నిందితునిగా చేర్చింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు, కోడ్ రాష్ట్రంలో అమలులోఉండగా రాజ్ కసిరెడ్డి (ఏ1) నుంచి సుమారు రూ.285కోట్ల వరకూ పలు దఫాలుగా, పలు ప్రాంతాలనుంచి చెవిరెడ్డి తీసుకుని ఐదుచోట్ల నిల్వ చేశారని సిట్ గుర్తించింది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పలువురు వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం ఆ డబ్బులు పంచినట్లు తేలింది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తన కోసమూ ఆ ముడుపులు ఖర్చుచేసిన భాస్కర్ రెడ్డి, తన కుమారుడు మోహిత్‌రెడ్డి కోసం చంద్రగిరిలోనూ వాటిని ఖర్చు చేసినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డితోపాటు ఆరుగురిని ఇటీవల నిందితులుగా చేర్చి, కోర్టులో వారిపై మెమో దాఖలుచేసింది.

# 600 ఫోన్ల ట్యాప్

(మొదటి పేజి తరువాయి)

ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళు_ంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

### గోదావరి-బనకచర్ల వివాదం

# అన్ని పార్టీల ఎంపీలతో నేడు సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

(మొదటి పేజి తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కీలక భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానాలు పంపామని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రైబ్యునల్ తీర్పులకు, చట్టాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని చూస్తోంది. ఈ విషయంపై మేము ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మా అభ్యంతరాలను తెలియజేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను కూడా కేంద్రానికి లేఖలు రాశాం. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల నీటి హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించాం" అని తెలిపారు.
ప్రస్తుతం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. "ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకుగాను ఎంపీలందరి అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించాం. అందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఘర్షణ

(మొదటి పేజి తరువాయి)

'మధ్యప్రాచ్యంలో జరుగు తున్న పరిణామాల దృష్ట్యా ప్రపంచ నేతల సమావేశం నుంచి ట్రంప్ తిరిగి వచ్చారు' అని శ్వేతసౌధం తెలిపింది. అధ్యక్ష భవనంలోని సిట్యుయేషన్ గదిలో సిద్ధంగా ఉండాలని ట్రంప్ తన జాతీయ భద్రతా బృందాన్ని ఆదేశించారంటూ వార్తలు వచ్చాయి. సంక్షోభాల సమయంలో అమెరికా ఇంటెలిజెన్స్, జాతీయ భద్రతా బృందం ఈ గదిలో సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుంది.'కెనడా నుంచి నేను వాషింగ్టన్‌కు తిరిగి రావడానికి, కాల్పుల విరమణకు ఏం సంబంధం లేదు. దాని కంటే పెద్ద పనే ఉంది. వేచి చూడండి' అని ట్రంప్ విలేకరులను ఊరిస్తూ చెప్పారు. ఇదిలావుండగా కెనడాలో ట్రంప్ ఇరాన్ ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. అమెరికాతో అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సిందని పునరుద్ఘాటించారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'అణు ఒప్పందంపై సంతకం చేయాలని నేను ఇరాన్‌కు చెప్పాను. వారు చేసి ఉండాల్సింది. కానీ చేయలేదు. సిగ్గుచేటు. ప్రాణనష్టం జరిగింది. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు. అంతా అయిపోయిందని నేను అంటున్నాను. ప్రతి ఒక్కరూ టెహరాన్‌ను ఖాళీ చేయాలి' అని హెచ్చరించారు.

**కాల్పుల విరమణ ప్రతిపాదనకు 'నో'**

ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అవకాశాలను ట్రంప్ పరిశీలిస్తున్నారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తెలిపారు. ముందుగా కాల్పుల విరమణ పాటించి, ఆ తర్వాత రెండు దేశాలు చర్చలు ప్రారంభించాలని ఆయన సూచించారు. అయితే కాల్పుల విరమణ ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చారు. మాక్రాన్‌పై ఆయన మండిపడుతూ 'నేను కాల్పుల విరమణ కోసం కృషి చేసేందుకే జీ-7 సదస్సును వీడి వాషింగ్టన్ డీసీ వెళ్లానని మాక్రాన్ పొరబాటుగా చెప్పారు. అది తప్పు. నేను వాషింగ్టన్ ఎందుకు వచ్చానో ఆయనకు తెలియదు' అని అన్నారు. కాగా ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను నివారించాలంటూ జీ-7 దేశాల అధినేతలు రూపొందించే ముసాయిదా ప్రకటనపై ట్రంప్ సంతకం చేయబోరని అమెరికా అధికారి ఒకరు సోమవారం నాడే చెప్పారు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ టెహ్రాన్‌తో అణు ఒప్పందం కుదుర్చు కోవాలని ట్రంప్ భావిస్తున్నారని అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్ తెలిపారు. మధ్యప్రాచ్యానికి అదనపు దళాలను తరలిస్తున్నామని ఆయన చెప్పారు. అమెరికా యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ సోమవారమే ఆగేయాసికాకు బయలు దేరింది. ఇజ్రాయిల్ సైనిక చర్యలో అమెరికా భాగస్వామి అవుతుందా కాదా అనే విషయంపై ట్రంప్ ఏమీ మాట్లాడడం లేదు.

# అమరావతికి మరింత జోష్

- రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

విజయవాడ/న్యూఢిల్లీజూన్ 17ఆంధ్ర ప్రగతి:
: రాజధాని అమరావతిలో రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కేంద్ర సచివాలయం (కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ -సీఎస్ఎస్), జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ (జీపీఆర్ఏ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. కూటమి ప్రభుత్వ చొరవతో రాజధాని నిర్మాణ పనులు ఊపందుకుంటున్న తరుణంలో ఈ శుభవార్త వినిపించింది. పెండింగ్‌లో ఉన్న ఈ రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను రూ.2,787 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు సంబంధించిన అనుమతులను కేంద్ర ఆర్థిక శాఖకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంగళవారం జారీ చేసింది. ఇందులో జీపీఆర్ఏకు రూ.1,329 కోట్లు, సీఎస్ఎస్‌కు రూ. 1,458 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఐనవోలు గ్రామంలో గతంలోనే 17 ఎకరాలను సీఆర్‌డీఏ కేటాయించింది. ఇప్పుడు మరోసారి అదే ప్రాంతంలో వీటి కోసం భూములు కేటాయించడానికి సిద్ధమైంది. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) నేతృత్వంలో పనులు చేపడతారు. రాష్ట్రాల రాజధానుల్లో ఈ ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేస్తుంది. 2018లోనే వీటికి నిధులు మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ, ప్రతిపాదనల అనంతరం ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పడ్డాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో రాజధానిలో నిర్మాణాల ప్రసక్తే లేకుండా పోయింది. దీంతో ఇప్పటివరకు ఆర్థిక ఆమోదం లభించక నిర్మాణం ఆలస్యమైంది.

# నంద్యాల మున్సిపాలిటీ లో కంప్యూటర్ ఆపరేటర్ల పెత్తనం..!




- 30 శాఖలు లేవు కానీ...27 మంది కంప్యూటర్ ఆపరేటర్లు.
- రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నంద్యాలలో.
- పేరుకే ఆపరేటర్లు...నేతలు,అధికారుల సేవల్లో తరిస్తున్నారు.
- సిబ్బంది,కాంట్రాక్టర్ల పనులకు పైసలిస్తేనే పనిచేస్తున్న ఆపరేటర్లు.
- కర్నూల్ కార్పొరేషన్ లో 8 మంది...నంద్యాలలో 27 మంది.
- కంప్యూటర్ ఆపరేటర్లు కదిలించే సత్తా,దమ్ము...అధికారులకు,నేతలకు లేదు.
- కంప్యూటర్ ఆపరేటర్ల వెనకుండి నడిపించే బలమైన శక్తి ఎవరో.
- 15 ఏళ్లుగా పాతుకుపోయిన ఆపరేటర్లు.
- అందరికంటే కొందరికి జీతాలు,గీతాలు ఎక్కువే.
- మున్సిపల్ చరిత్ర కంప్యూటర్ ఆపరేటర్ల చేతుల్లో దాగి ఉందా.
- పంచపాండవుల ను కదిలిస్తే మున్సిపాలిటీ బాగుపడుతుంది.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17:**

రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీ,కార్పొరేషన్ ల కంటే నంద్యాల మున్సిపాలిటీ చరిత్ర సృష్టించడంలో రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తుంది.నంద్యాల మున్సిపాలిటీ ఇన్ని అవార్డులు సాధిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డులు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కానీ పరిస్థితి.అమరావతి కార్యాలయంలో కూడా ఇంత మంది ఆపరేటర్లు లేరని తెలుస్తోంది.కర్నూల్ కార్పొరేషన్ లో సైతం 8 మంది కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది.నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో 30 శాఖలు కూడా లేవు కానీ 27 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉండడం విశేషం.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నంద్యాల మున్సిపాలిటీలో ఇంత మంది ఆపరేటర్లు ఉండడంతో ముక్కున వేలువేసుకుంటున్నారు.మరో విశేషం ఏమంటే వీరిలో కొందరికి మాత్రమే స్పెషల్ జీతం ఇస్తున్నట్టు తెలుస్తోంది.అంతేనా సిబ్బంది,కాంట్రాక్టర్ల పనులు చేయాలంటే లంచం లేనిదే పనులు చేయరని తెలుస్తోంది.పోస్టింగ్,జీతాలు మాత్రం ఆపరేటర్లు అని ఉంటుంది.వారు మాత్రం నేతలు,అధికారుల పనుల్లో నిమగ్నం అవుతున్నారు.మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్లు,అటెండర్ లను ప్రసన్నం చేసుకుంటే పనులు ఇట్టే పరిష్కారం అవుతాయి.2010 నుంచి కొందరు కంప్యూటర్ అపరేటర్లుగా చేస్తూ మున్సిపాలిటీ చరిత్రను గుప్పెట్లో పెట్టుకున్నారు.మున్సిపల్ చరిత్ర వారి చెప్పు చేతుల్లో ఉండడంతో కంప్యూటర్ ఆపరేటర్లు ను అధికారులు ప్రశ్నించే సాహసం చేయడం లేదు.పొరపాటున వారిపై ఎవరైనా అధికారులకు,నేతలకు పిర్యాదు చేస్తే వారితో మా కెందుకు అనడం విశేషం.కంప్యూటర్ ఆపరేటర్లు వెనుక బలమైన రాజకీయ శక్తి ఆడిస్తుందనీ తెలుస్తోంది.ఆ నాయకుని కి చెందిన ఆపరేటర్లు మాత్రమే పని చేయాలి ,గతంలో పని చేసిన కొందరు ఆపరేటర్లు ను వేరే ప్రాంతాలకు బదులిచేశారు.15 ఏళ్లుగా పాతుకుపోయిన ఆపరేటర్లు కదిలించే దమ్ము ఎవరికి లేదు.అందరికంటే కొందరికి జీతాలు,గీతాలు ఎక్కువే అని తెలుస్తోంది.మున్సిపల్ చరిత్ర కంప్యూటర్ ఆపరేటర్ల చేతుల్లో దాగి ఉండడంతో అధికారులు,నేతలు వారి జోలికి వస్తే మా ఉద్యోగాలకు ఎదురు పడుతుందని మౌనంగా ఉంటున్నారు.కంప్యూటర్ ఆపరేటర్లకు అనుకూలమైన వారికి మాత్రం క్షణాల్లో సమాచారం గుట్టుగా ఇచ్చి క్యాష్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రధానంగా పంచభూతాలు అని పిలవబడే కంప్యూటర్ ఆపరేటర్లు చెప్పిందే వేదం గా నడుస్తోంది.మరి కొందరు ప్రస్తుతం పని చేస్తున్న ఆపరేటర్లు మారిస్తే కొద్దిగైనా మున్సిపాలిటీ బాగుపడుతుందని పేర్కొంటున్నారు.నంద్యాల మున్సిపాలిటీలో 27 కంప్యూటర్లు లేవు కానీ 27 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారంటే అర్థం చేసుకోండి.మున్సిపాలిటీకి ఇంత మంది అవసరమా.ఇక అవార్డులు ఎందుకు ఇవ్వాలంటే గతంలో తెలంగాణా అజెండా నంద్యాల కౌన్సిల్ లో పాస్ చేయడం,సంతలో పశువులు కొన్నట్టు సభ్యులను కొనుగోలుచేశామని మాట్లాడడం,చైర్మెన్ కంట తడి పెట్టడం, ప్రోటోకాల్ పై కౌన్సిల్ సభ్యులతో వాగ్వివాదం, 60 అడుగుల రోడ్డు 30 అడుగులకు,40 అడుగుల రోడ్డును 60 అడుగులకు పెంచడం.పన్నుల వసూళ్లలో 5 వ స్థానం ఉన్న నంద్యాల 98 స్థానానికి దిగజారడం,ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు నిధులు తగ్గించడం,కౌన్సిల్ సభ్యులు వాకవుట్ చేయడం, ప్రోటోకాల్ పాటించడం లేదని కౌన్సిల్బుబులు అడిగిన ప్రశ్నకు ,కౌన్సిల్ ను కౌన్సిల్ సభ్యులను లెక్క చేయకుండా మున్సిపల్ ఇంజనీర్ బయటికి వెళ్ళడం,నిన్న జరిగిన సమావేశంలో ఆ అధికారి రాకపోవడం,ఇలాంటి అధికారిని పై చర్యలు తీసుకోక పోవడం,కార్గిల్ యుద్ధవీరుడు అధికారుల నిర్లక్ష్యానికి మృతిచెందిన అధికారులపై చర్యలు లేకపోవడం, ఉరకుందా అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమతులు ఏమి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టడంతో అధికారులు ఇంటిని పగల కొట్టడానికి వెళ్లడంతో ఏకంగా అధికారుల పేర్లు చెప్పి 10 లక్షలు లంచం ఇచ్చానని మీడియా ముందు మాట్లాడినా చర్యలు శూన్యం,సాక్షాత్తు మున్సిపల్ కమిషనర్ నా వద్ద లంచం తీసుకున్నాడని బహిరంగంగా ఓ బాధితుడు చెప్పడం,ఇద్దరు మధ్య గొడవ జరగడం కేసుకూడా పెట్టారు,అసలు కమిషనర్ ను నడిరోడ్డు లో కొట్టారని సిబ్బంది సంఘీభావంగా ధర్నా చేసిన విషయం తెలిసిందే.నంద్యాల మున్సిపల్ చరిత్రలో ఒక కమిషనర్ ను నడిరోడ్డుపైంకొట్టిన సంఘటన నంద్యాలకు సొంతం.ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలు ఉన్నా కనీసం ఇన్ని రికార్డ్స్ సృష్టించిన నంద్యాల మున్సిపాలిటీ అధికారులకు రాష్ట్ర స్థాయిలో అవార్డులు,సన్మానం చేయాల్సిందే. ఏదీ ఏమైనా కంప్యూటర్ ఆపరేటర్లు ను కదిలించే సత్తా,దమ్ము,ధైర్యం రాజకీయ నాయకులకు,అధికారులకు లేకపోవడం విశేషం.నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ శేషన్న అయినా అవసరం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు ను ఏర్పాటుచేసుకుని మిగతావారికి వారి హోదాకు తగ్గ పనులు ఇస్తారని ఆశిస్తున్నారు.మరో వైపు జీతాలు సైతం 40 మంది సీనియర్స్ ఉంటే కొందరికే జీతాలు పెండచంపై సిబ్బంది మధ్య వ్యత్యాసాలు కూడా పరిశీలించాలని కోరుతున్నారు.ఈ రోజు సిబ్బంది సమావేశం ఉన్నట్టు తెలుస్తోంది.

## ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17:**

ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి నాగరాముడు, జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జూన్ 15 జులై 15 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ/ఉపాధి/నిరుద్యోగ భృతి సాధనకై ఐదు లక్షల అర్జీలను రాష్ట్ర గవర్నర్ కు , సీఎం కు పంపించే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా నాగరాముడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా మోసం చేసిందని 40 సంవత్సరాల రాజకీయం అనుభవం ఉన్న నన్ను గెలిపిస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని , అలా చేయలేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తానని ఆమె ఇచ్చి సంవత్సరం పూర్తి అయిన ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహాయించి ఏ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి కి యువతకు ఉపాధి కల్పించే విషయంలో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఇప్పటికి నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండేదని అయితే కేవలం 16 వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మిగతా శాఖల ఉద్యోగాల గురించి గానీ నిరుద్యోగ భృతి గాని మర్చిపోయారని విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న 2 లక్షల 60 వేల వాలంటరీల ను తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిందని కేకులు కట్ చేసుకుని సంబరాలు చేసుకునే పాలకులు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ఏం చేశారని వారి ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా యువతను నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగమైన కల్పించండి, లేదంటే స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయండి.లేదంటే యువగలం పాదయాత్రలో నిరుద్యోగ భృతి కి ప్రణాళికల సిద్ధం చేశామన్న చెప్పిన విధంగా లినిరుద్యోగ భృతి అయిన ఇప్పటివరకు ప్రతి ఒక్కరికి రావలసిన 36000 తోపాటు ప్రతి నెల 3000 ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర గవర్నర్ కి , సీఎం, నిరుద్యోగుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల అర్జీలు పంపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపునివ్వడం జరిగింది. కావున అందులో భాగంగా ఈనెల 20వ తేదీ శుక్రవారం నాడు ఉదయం 10 గంటల నుండి కర్నూలు కలెక్టర్ కార్యాలయాల దగ్గర అర్జీలు పంపించే కార్యక్రమం జరుగుతుంది కావున అధిక సంఖ్యలో యువతీ యువకులు నిరుద్యోగులు పాల్గొని ఏఐవైఎఫ్ ఉద్యమానికి తోడ్పడడమే కాకుండా ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని వారి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర నాయకులు చంటి, కాసిం, అఖిల్, శివ, రాజేష్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 సంవత్సరాలు జైలు శిక్ష.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 17:**



15:07.2022 వ తేది ముందర ఒక సంవత్సరం క్రితం నుండి ఫిర్యాది కూతురిని ముద్దాయి ప్రేమిస్తున్నాను అని, పెళ్లి చేసుకుంటాను అని చెప్పి నమ్మించి మాయ మాటలు చెప్పి,ఫిర్యాది లేనప్పుడు ఆమెతో శారీరకంగా అనుభవించేవాడని, ఫిర్యాదికి తన కూతురు కడుపు నొప్పి వస్తుంది అని చెప్పగా,నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నందు చూపించాగా అమ్మాయి గర్భవతి అని తెలియడంతో దీనికి కారణం ముద్దాయి అని ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు ఎస్ఐ జగన్మోహన్ నమోదు నమోదు చెయ్యడం జరిగింది. అప్పటి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్స్ అయిన మహేశ్వర రెడ్డి, నంద్యాల డిఎస్పి %×%/సి ఆత్మకూరు డిఎస్పి కేసు ను అన్నీ కోణాల్లో క్షుణ్ణముగా దర్యాప్తు చేసి, ముద్దాయి అయిన తెలుగు గంగాధర్ ను అరెస్ట్ చేసి, రిమాండ్ పంపగా, తదనంతరం అప్పటి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీమతి. శృతి, ఆత్మకూరు డిఎస్పి దర్యాప్తు కొనసాగించగా, వారి తదనంతరం అప్పటి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీ. శ్రీనివాసరావు గారు 12.06.2023 వ తేదీన జిల్లా సెషన్ కోర్టు నందు అదేవిధంగా ఫోక్సో కోర్ట్ నందు మొత్తముగా 20 మంది సాక్షులతో చార్జి షీట్ ఫైల్ చెయ్యడం జరిగింది.సదరు కేసుపై నంద్యాల జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆత్మకూరు డిఎస్పి .రామంజి నాయక్ పర్యవేక్షణలో ఆత్మకూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.సురేశ్ కుమార్ రెడ్డి వెలుగోడు ఎస్సై సురేష్ బాబు ఆద్వర్యంలో వెలుగోడు పోలీసు వారు సరైన సాక్షాదారాలను కోర్టుకు సమర్పించగా సదరు కేసుకు సంబందించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫోక్సో కోర్టు సి వి శ్రీనివాసులు వాదనలు వినిపించగా జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఫోక్సో కోర్ట్ కర్నూల్ వారు విచారణ అనతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 సంవత్సరాల జైలు శిక్ష మరియు 25000/- రూపాయల జరిమానా విదిస్తూ తీర్పు వెలువరించటమైనది. క్రమము తప్పకుండా సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా హాజరు పరచేలా చేసిన ఆత్మకూర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అయిన ఎం .సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సురేష్, మరియు వెలుగోడు కోర్ట్ హెడ్ కానిస్టేబుల్: పురుషోత్తం రావు హెడ్ కానిస్టేబుల్- 2730 లను, నంద్యాల జిల్లా ఎస్పీ ఆధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేకముగా అభినందించారు.

## ప్రభుత్వ నిబంధనలు ప్రభుత్వమే పాటించరా.!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 17:**



ప్రభుత్వం నిబంధనాలు ప్రభుత్వమే పాటించకపోవడంతో బనగానపల్లె వినియోగదారులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వము జైళ్ళ శాఖ ఉపకారగారం ఆధ్వర్యంలో డీజీలు పెట్రోల్ బంకులు నడుపుతున్నారు ఆ భాగంగా బనగానపల్లె పర్యవేక్షణ అధికారి ఉపకార గారము, ఆధ్వర్యంలో జైళ్ళ శాఖ పెట్రోల్ డీజిల్ బంకు ఏర్పాటు చేశారు, ఇక్కడ అధికారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు లేదని క్యాష్ మరియు డిజిటల్ సేవలు అందించాలని నిబంధనలు తెలుపుతున్న ఇక్కడ పనిచేస్తున్న జైలు శాఖ అధికారులు డిజిటల్ సేవలు తప్పకుండా పాటించాలని అడుగుతున్న పట్టించుకోవడంలేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు ఎన్నోసార్లు పర్యవేక్షణ అధికారికి తెలియజేసిన నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. రోజుకు వందల మంది డిజిటల్ సేవలు లేకపోవడంతో పెట్రోలు డీజీలు తీసుకోకుండా బండిలో పట్టించుకోకుండా వినియోగదారులు వెళ్ళిపోతున్నారు. కావున జిల్లా అధికారులు ఇక్కడున్న అధికారులపై చర్యలు తీసుకుని బనగానపల్లె పెట్రోల్ బ్యాంకులో డిజిటల్ సేవలు అందించే విధంగా కృషి చేయాలని కోరుచున్నారు.

## భారీగా నకిలీ రెవెన్యూ రికార్డులు, డీకేటీ పట్టాలు తయారు

### - రంగంలోకి కలెక్టర్.! రాయచోటి నియోజకవర్గంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల తనిఖీలు

### - భారీగా నకిలీ రెవెన్యూ రికార్డులు, డీకేటీ పట్టాలు స్వాధీనం.

**ఆంధ్ర ప్రగతి రాయచోటి జూన్ 17:**

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో నకిలీ రెవెన్యూ రికార్డులు, డీకేటీ పట్టాలు తయారు చేస్తున్న రెవెన్యూ సిబ్బందిపై జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపించింది. పక్కా సమాచారంతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నకిలీ దస్త్రాలను కలిగి ఉన్న సిబ్బంది ఇళ్లపై దాడులు చేయించారు. రాయచోటి మండలం సిబ్యాలలో మాజీ వీఆర్వో నాగరాజు ఇంట్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు సోదాలు చేశారు. వీఆర్వోగా పనిచేసిన నాగరాజు గతంలో భారీగా నకిలీ రెవెన్యూ రికార్డులు, అడంగల్, డీకేటీ పట్టాలు తయారు చేసినట్లు



గుర్తించారు. ఆయన మరణించినా కుటుంబ సభ్యులు కూడా ఇదే పంథా కొనసాగిస్తున్నట్లు తేలడంతో ఆయన ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. నాగరాజు ఇంట్లో పెద్ద ఎత్తున నకిలీ రికార్డులు, డీకేటీ పట్టాలు బయటపడ్డాయి. రాయచోటి పట్టణంలోని డిప్యూటీ తహసీల్దార్, మరో రెవెన్యూ సిబ్బంది ఇంట్లోనూ సోదాలు చేస్తున్నారు. ఇక్కడ కూడా నకిలీ పట్టాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వీటిపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆరా తీస్తున్నారు. భూముల ఆక్రమణదారుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుని రెవెన్యూ సిబ్బంది ఇలాంటి నకిలీ పట్టాలు సృష్టించినట్లు తెలుస్తోంది.

# చదువుకోవాలంటే.. చదువు కొనాల్సిందేనా..?

## అక్రమంగా నడుపుతున్న స్కూలపై కఠిన చర్యలు ఏవి...?
## ఏదోచ్ఛగా కార్పొరేట్ స్కూల్ దందా. -నిరుపేదల తల్లిదండ్రులకు మోయలేని భారం!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 17:**

**శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు అన్న తిరుగ పాఠశాలలో పనిచేస్తున్నాయి విద్య అంటే పేదవాడిని... ధనవంతుణ్ణి ఒకే చోట కూర్చోబెట్టి చోటు.. చదువు ఒకటేనని.. అటు వంటి చదువు నేడు పూర్తిగా దన్యమైపోయింది. సామాన్యుడికి అందని ద్రాక్షలా మిగిలిపోయింది కార్పొరేట్ ముసుగులో విద్యా సంస్థలు చేస్తున్న విద్య దోపిడీ చేస్తున్న సంస్థల అరాచకాల పై ప్రత్యేక కథనం.కనీస విద్యా అర్హత స్కూల్లో నిర్వహించడానికి తీసుకోవాల్సిన ప్రమాణాలు గానీ లేకుండా కేవలం ఒక బిల్డింగ్ ఉంటే చాలు.. విద్య అనే వ్యాపారాన్ని ప్రారంభించి నలుగురికి చేరుకోవాల్సిన విద్యని షోకేస్ లో ఖరీదైన బొమ్మల నేడు మారిపోయింది..**




వివరాల్లోకి వెళితే నగరం లో పుట్టగొడుగుల పుట్టుకొచ్చిన కార్పొరేట్ స్కూళ్లు కాలేజీలు ముఖ్య అ జెండా.. దోపిడీ! సరైన లైసెన్సులు లేకుండా వీధికొక స్కూల్ ను పదిమంది స్టాఫ్ తో కలిసి చాలీచాలని ఇరుకు గదులలో కనీస సదుపాయాలు కూడా లేకుండా ఏసీ తరగతులుకు ఒక రేట్..? నాన్ ఏసీ తరగతులకు ఒకరేటని పెట్టి.. దోపిడీ భారీగా నిర్వహిస్తున్నారు.
పుట్టగొడుగుల పుట్టుకొచ్చిన స్కూల్స్..ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు! విద్యాశాఖ ఇటువంటి వ్యవహారాల్లో పాము చావదు కర్ర విరగదు! ఏ విధంగా ఎవరినైనా నొప్పించకూడదని నైజంతో అధికారులు బయటకు ఊక మాటల లోన ఒక మాటల మాట్లాడి..నింపుకుంటారని వాదన గట్టిగా వినిపిస్తోంది స్కూల్స్ కాలేజీలో సరైన ప్రమాణాలు పాటించకుండా ప్రారంభ సమయంలో తీసుకునే లైసెన్సులతో..రెన్యువల్ కూడా చేయకుండా ప్రీతి సంవత్సరం తరగతి గదులు పెంచుకుంటూ పోతుంది ఒకవేళ విషయం బయటకు పొక్కి ఎవరైనా దీనిపై గట్టిగా ప్రశ్నిస్తే సంబంధిత అధికారుల పై వొతిడి తెచ్చి నోరు ము యించి గుటు చపుడు కాకుండా యాజమాన్యాలు స్కూల్స్ నిర్వహణ నిర్వహిస్తున్నారు నగరంలో ఎన్ని స్కూళ్లు కు పర్మిషన్లు ఉన్నాయి?ఎన్ని స్కూళ్లకు పర్మిషన్లు లేవు..! అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు చేపడితే... అందరిని ద్రాక్షగా మిగిలిన విద్య ప్రతి ఒక్కరికి అందుబాటులో వస్తుందని సామాన్యులు సైతం విద్యను తమ పిల్లలకు అందించగలుగుతారు అడ్మిషన్ల పేరుతో చేసే వ్యాపారాన్ని అడ్డుకట్ట చేసే దిశగా అడుగులు వేసే వారు అవుతారని ప్రజలు భావిస్తున్నారు.!

### అడ్మిషన్స్ పేరుతో వ్యాపారం!

ప్రైవేట్ స్కూల్ కార్పొరేట్ కాలేజీ అడ్మిషన్ల పేరుతో విద్య వ్యాపారాన్ని ప్రారంభించేశారు ఎల్కేజీలో పిల్లలు జాయిన్ చేయాలంటే కనీసం 60 వేల నుండి లక్ష రూపాయలు చెల్లించాల్సి వస్తుంది... కొత్త అడ్మిషన్ కి డొనేషన్లు అదనంగా ఇలా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రభుత్వం పరంగా నియత్ నుంచే నియంత్రిచె దిక్కే లేదు ,ఇక ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల దోపిడి గురించి చెప్పనక్కర్లేదు ఉన్నత విద్య పేదవారికి మిద్దెగా ఎప్పుడో మారిపోయింది ప్రతి కుటుంబం తమ పిల్లల విద్య కోసం తాహతుకు మించి ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నారు ఫీజుల దోపిడీ గురించి తల్లిదండ్రులకు ప్రజాప్రతినిధులకు స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదు చేసిన విద్యాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం..! స్కూల్లో పనిచేసే ప్రైవేట్ ఉపాధ్యాయులు పాటు నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా అడ్మిషన్లు టార్గెట్ విధించి విద్యార్థులను చేర్పించే పని చేస్తున్నారు టెక్నో ఈ టెక్నో ఒలంపియాడ్ మెయిన్ ఎం జెడ్ అంటూ ఆకర్షణ పేర్లు పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.

## బ్రిక్స్ శిఖరాగ్ర సభలో భారత దేశ ప్రతిష్టను పెంచిన
# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి అపురూప ఘన సన్మానం.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూన్ 17:**
బ్రెజిల్ దేశంలోని బ్రెసిలియా నగరం లో ఇటీవల జరిగిన బ్రిక్స్ ( బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికా దేశాల కూటమి ) 11వ శిఖరాగ్ర సమావేశాలకు భారతదేశం తరుపున బ్రిక్స్ పార్లమెంటరీ మహిళా ఫోరమ్ కు నాయకత్వం వహించి భారతదేశ ప్రతిష్టను ఇనుమరింపజేసి, నంద్యాల ఖ్యాతిని ప్రపంచానికి చాటిన నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరికి అపురూప ఘన స్వాగతం పలికిఉమ్మడి కర్నూలు జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం, భారతీయ జనతా పార్టీ నారీమణులు, కర్నూలు బిల్డర్ అసోసియేషన్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు గొప్పగా ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, దక్షిణ భారత బజరంగ్దళ్ కార్యనిర్వాహక్ టీ.ప్రతాపరెడ్డి, బనగానపల్లె బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి బి వి సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో రెడ్డి సామాజిక వర్గం వారందరూ కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని సన్మానం చేసి మాట్లాడుతూ యువ పార్లమెంటరీ డాక్టర్ బైరెడ్డి శబరిని సత్కరించుకోవడం ఆనందదాయకంగా ఉన్నదన్నారు. నంద్యాల ఎంపీ గా, రాయలసీమ నుండి ఒక రెడ్డి బిడ్డ ఇంతటి గొప్ప స్థానం సంపాదించడం యావత్ రెడ్డి సామాజిక వర్గానికి గర్వకారణమన్నారు. జయహో బైరెడ్డి శబరి మీరు ఇంకా ఉన్నత పదవులు అజిష్ఠించాలని కోరికతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో మీరు ఇంకా ఎదగాలని కోరుకుంటూ రెడ్డి సామాజిక వర్గం అంతా కూడా ఆశిస్తూ ఉన్నదన్నారు.
సన్మాన గ్రహిత ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ మీరు చూపిన అభిమానం, ప్రేమ మరువలేనని, మీ నమ్మకాన్ని ఒమ్ము చేయనని, ఎంపీ గా, మీ బిడ్డగా నిరంతరం ప్రజా సేవ చేస్తానని, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని, నన్ను సన్మానించిన అందరికి ప్రత్యేక ధన్యవాదములు అన్నారు.

# డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్లు మాట్లాడకండి..
# సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లకండి.

### -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 17:**
రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు. వాహనదారులు సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లడం వల్ల మీతో పాటు మీ తోటి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రాంగ్ రూట్ లో వెళ్లటం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. కావున సమయం కలిసొస్తుందని రాంగ్ రూట్ లో వెళ్లకండి. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడకూడదని అందరికీ తెలుసు. అయితే దానిని పాటించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లు ఉపయోగించడం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు అధికమగుచున్నాయని కావున డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లు ఉపయోగించకుండ రోడ్డు ప్రమాదాలను నివారించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా నాణ్యమైన హెల్మెట్లు ధరించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. నాణ్యమైన హెల్మెట్లు వినియోగిస్తే ప్రమాదం సంభవించినా ప్రాణహాని ఉండదన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకువాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని,హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం చెయొద్దని, మనపై ఆధారపడ్డ కుటంబ సభ్యుల బాధ్యత మన పై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. అనేక కారణాల వల్ల ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడం చాలా బాధాకరమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని ప్రభుత్వం ద్వారా జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫస్ట్ రెస్పాండర్స్‌గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంకులు, దాబాల్లో పని చేసే వారికి, యువతకు, గ్రామస్థులకు ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై అవగాహణ కలిగించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.



పి.మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 17:** రాయమాల్ పురం మునగాల గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు శ్రీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం సమయానికి వర్షాలు కురుస్తున్నందున రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ లేదా పిల్లి పెసర లేదా మినుము సాగు చేయాలని దీనివలన భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని తెలిపారు. అలాగే వరిగట్లపై కంది లేదా కూరగాయలు సాగు చేయుట వలన రైతులు అదనపు ఆదాయం పొందగలరని, ఎరువులు పురుగుమందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలిపారు. అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడడం వలన సాగు ఖర్చులు తగ్గించగలరని అలాగే పురుగుమందులు విచక్షణారహితంగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు సాలు వరి సాగు చేయటం వలన సేద్యం ఖర్చులు తగ్గించగలరని ,అలాగే వరిలో ఎండి ఎల్ ఆర్ 7, ఆర్ ఎన్ ఆర్ 15048 రకాలు ఖరీఫ్ సాగుకు అనువైనవి అని, అలాగే వరిలో ఎరువులను మోతాదుకు మించి వాడకుండా నత్రజని ఎరువులను మూడు దఫాలుగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మనోహర్, గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యావంతులుగా సత్తా చాటాలి.

### -తల్లికి వందనంతో పేదలకు అండగా ప్రభుత్వం.
### -టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపి పరిశీలకుడు ఏవిఆర్ ప్రసాద్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17:** విద్యార్థి దశలో విద్యార్థులు తమ చుట్టూ ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత విద్యావంతులుగా సత్తా చాటాలని ఎస్పీజీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపి పరిశీలకుడు ఏవిఆర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్పిజి హైస్కూల్ లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత అధ్యక్షతన జరిగింది. పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల చైర్మన్ ఎం జ్యోతి, పాఠశాల పూర్వ విద్యార్థిగా ఏవిఆర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ మన్నే కృపాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవిఆర్ ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్పిజి హైస్కూల్ లో తాను చదువుకునే సమయంలో ఇందిర అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ర్యాంకుతో అప్పట్లో నంద్యాలకు పేరు ప్రఖ్యాతలు తేవడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన కుటుంబాల్లోని చదువుకునే పిల్లలందరికీ, ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ద్వారా తల్లుల అకౌంట్లలో కి డబ్బును జమ చేసి విద్యారంగ పక్షపాత ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలిచిందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యారంగంలో ఎస్పీజీ హై స్కూల్ కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించాలని ఏవిఆర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్ కృపాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని, వారి కుటుంబాలకు అండగా, సమాజాభివృద్ధిలో భాగస్వాములై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతన బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ కృషి.

### -డి.ఎఫ్.సి.ఎస్ చైర్మన్ బి.ఎస్. నవీన్ కుమార్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 17:** నంద్యాల జిల్లా, బనగానపల్లె మండలం, కృష్ణగిరి గ్రామం, జుర్రెరు ప్రాజెక్ట్ చెరువుబనగానపల్లె మత్స్య సహకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చే ప్రక్రియలో భాగంగా, స్థానిక మత్స్యకారులకు ఐదు రకాల నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు మత్స్యకారుల సామర్థ్యాన్ని గుర్తించడమే కాక, వారికి అవకాశాలు కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకొని చేపట్టినవని నిర్వాహకులు తెలిపారు. ఈ నైపుణ్య పరీక్షలను త్రీ-మెన్ కమిటీ సమక్షంలో నిర్వహించారు. కమిటీ సభ్యులుగా డి.ఎఫ్.సి.ఎస్ చైర్మన్ బి.ఎస్. నవీన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ శ్రీ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ శ్రీ వై. లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా డి.ఎఫ్.సి.ఎస్ చైర్మన్ బి.ఎస్. నవీన్ కుమార్ మాట్లాడుతూ,“కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తోంది. వారి జీవనోపాధి మెరుగుపరచడమే లక్ష్యంగా అన్ని రంగాల్లో మద్దతు అందిస్తోంది. మత్స్యకారులు ఐకమత్యంతో పనిచేస్తూ ఆర్థికంగా బలపడాలి,” అని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు శ్రీ పామన్న, శిరోమణి, శివ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థాయి మత్స్యకారులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై, ఉత్సాహంగా తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 18 జూన్ 2025

# మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దండి.

## -మహిళల ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటు అందించండి.

### -ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించండి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 17:**
మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది వారి ఆర్థిక స్వలంబనకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మెప్మా పిడి, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమీషనర్లు, మెప్మా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక లక్ష్యం 221 యూనిట్ల నెలకొల్పనకు మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీలో 111, ఆళ్లగడ్డలో 24, ఆత్మకూరులో 19, బేతంచెర్లలో 17, డోన్ లో 26, నందికొట్కూరులో 24 యూనిట్లను స్థాపించి మహిళల జీవనోపాధి, ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటును అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్లు, మెప్మా అధికారులను ఆదేశించారు. అలాగే ఓఎన్డిసి సైట్ లో స్వయం సహాయక సంఘాల మహిళలు విక్రయించే ఉత్పత్తులను పెద్ద ఎత్తున ప్రోత్సాహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణాలు అందించడంలో కూడ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు.

# దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ.

## పెళ్లిరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్న నాగమల్లేశ్వర రెడ్డి దంపతులు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూన్ 17:** సిరివెళ్లమండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల ఎంపీపీ స్కూల్ నందు దానధర్మా ట్రస్ట్ ఆధ్వర్యంలో 3,4,5, తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సిరివెళ్ల మండల ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వర రెడ్డి రుక్మిణి దంపతులు చేతుల మీదుగా పుస్తకాలు అందజేయడం జరిగింది. అదేవిధంగా వారి మొదటి వివాహ వార్షికోత్సవ సందర్భంగా అక్కడే చదివే విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ, విద్యాసామాగ్రి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దానాధర్మ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన

# పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ.



**ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జూన్ 17:** కేషనల్ సొసైటీ గౌరవ సలహాదారులు డా,, కమళే గణేష్ పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, యు మం ఏంకోబులు సామాజిక సేవ కార్యకర్త పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న అనాధ శవానికి ఎమ్మినూరు గోనెగండ్ల బైపాస్ బీసీ స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు అందించిన సమాచారంమేరకు ఎమ్మిగనూరు టౌన్ శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న కరెంటు డీపు పక్కన నిన్న తేది 16/06/2025 సాయంత్రం 45 సంవత్సరాల మధ్య వయసుగల అనాధ వ్యక్తి పడి ఉన్నాడని అటుగా వెళుతున్న వ్యక్తులు 100 నెంబర్ కు ఫోన్ చేయగాపట్టణ పోలీసులకు హుటాహుటిన అక్కడకు చేరుకుని పడి ఉన్న వ్యక్తిని ప్రభుత్వా ఆస్పటల్ తీసుకెళ్లారు డాక్టర్లు చూసి చనిపోయాడని వారు తెలిపారు బాడిని మార్చురీ ఫ్రీజర్ బాక్స్ లో భద్రపరిచి అనాధ శవం వివరాల కోసం పోలీసులు కేసు నమోదు చేసి ఆరా తీయగా తన వివరాలు తెలవకగపోగా నేడు పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సాతర్ల ప్రసాద్ జిల్లా అధ్యక్షులు సామాజిక సేవ కార్యకర్త యు నరేష్,కానిస్టేబుల్ వై రంగన్న, ఎస్ బి కే బి నవాజ్ టౌన్ అధ్యక్షులు మల్లెపోగు అబ్రహం తదితరులు పూలమాలలు వేసి అంత్యక్రియలు పూర్తి చేశారు.

## ఏపీలో నియోజకవర్గాల

# పునర్విభజనకు లైన్ క్లియర్.!

### -175 నుంచి 225కు పెంపునకు మార్గం సుగమం.



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17:**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్థానాలు 175 నుంచి 225కు.. తెలంగాణ శాసనసభ స్థానాలు 119 నుంచి 134కు పెంపునకు మార్గం సుగమమైంది. దేశంలో జన గణన చేపట్టడానికి అనుమతిస్తూ సోమవారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జనగణన వచ్చే ఏడాది పూర్తి కానుంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా దేశ వ్యాప్తంగా లోక్సభ స్థానాలు.. శాసనసభ స్థానాల పునర్వి భజన ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టనుంది. రాజ్యాంగంలోని 170వ అధికర ణలోని సెక్షన్-15 ప్రకారం శాసనసభ స్థానాలను ఆంధ్ర ప్రదేశ్లో 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 134కు పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టా లని విభజన చట్టం-2014లో సెక్షన్-26(1) ద్వారా ఎన్నికల సంఘానికి కేంద్రం నిర్దేశించింది.

# సుగాలి మెట్ట ఏపీ మోడల్ స్కూలును

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**మోడల్ స్కూలులో ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు ఉద్బోధించిన కలెక్టర్**

**పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తాం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**












**ఆంధ్ర ప్రగతి పాణ్యం/నంద్యాల , జూన్, 17:**
పాణ్యం మండలం సుగాలి మట్ట ఏపీ మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ పాఠశాలలోని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యాభ్యాసం, పాఠశాలలోని సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి వసతి, అప్రోచ్ రోడ్డు సమస్యగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయోగశాలలోని అన్ని పరికరాలు ఉన్నాయా లేదా సంబంధిత వివరాలపై ఆరా తీశారు. మోడల్ పాఠశాలతో పాటు చుట్టూ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలకు అవసరమైన త్రాగునీటి వసతి, సీసీ రోడ్డు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పదవ తరగతి గదిని పరిశీలిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తూ ఉపాధ్యాయురాలిగా మారి ఇంగ్లీష్ క్లాస్ తీసుకొని పాఠ్యాంశాలపై ఎలా ఆలోచించాలి, భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి తదితర అంశాలపై విద్యార్థులకు ఉద్బోదించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ ఆహార పదార్థాలను పిల్లలకు తినిపించారు. వంటశాల, స్టోర్ రూంలో నిల్వ ఉన్న సరుకులు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహార పదార్థాలను అందించాలని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్ ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ ను, ఎంఈఓ ను కలెక్టర్ ఆదేశించారు.

# 5 సం. లు,15 సం.లు వయసు దాటిన విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి.

## -5 సం.లు 15సం.ల వయసు వారు ఉచితంగా అప్డేట్ చేసుకోవచ్చు.

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 17:**
ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కు సంబంధించి 5 సం.లు, 15 సం.లు దాటిన పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిఎల్ఎఎంసి (జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ శివారెడ్డి, జిఎస్డబ్ల్యూఎస్ సమన్వయకర్త ఖాదర్, ఆధార్ రీజినల్ కార్యాలయ సిబ్బంది దామోదర్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఆధార్ ఉన్న చిన్నారులు తప్పనిసరిగా రెండు సార్లు (5సం.ల నుండి 7సం.లు, 15సం.లు నుండి 17 సం.లు మధ్యలో) ఉన్న వారు తప్పనిసరిగా ఆధార్ అప్డేట్ చేయాలన్నారు. 5 సం.లు, 15 సం.లు దాటిన చిన్నారులు ప్రతి ఒక్కరూ ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి చేసుకోవాలన్నారు. అందుకు 5సం.లు, 15సం.ల వయస్సు వారు ఉచితంగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పోటీ పరీక్షలు వ్రాసే అవకాశం వున్న నేపథ్యంలో తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని డిఈఓను కలెక్టర్ ఆదేశించారు. 7 సం. లు, 17 సం. లు దాటిన చిన్నారులు/విద్యార్థులు వంద రూపాయల రుసుం చెల్లించి ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఆధార్ సెంటరు ఏర్పాటు చేయడానికి గాను అవసరమైన శిక్షణను ఎస్వీఆర్ ఇంజనీరింగ్ లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన వెంటనే తాత్కాలిక జనన ధృవీకరణ పత్రం అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో చంటి పిల్లలు (0-5సం.లకు) సంబంధించిన వివరాల్లో వ్యత్యాసాలు లేకుండా చూడాలని సంబధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను కలెక్టర్ ఆదేశించారు.

## ప్రధాన కార్యాలయం పేరుతో

# అక్రమ వసూళ్లు..నిజమేనా.?



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 17:**
ఏపీ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం పేరుతో అక్రమ వసూళ్లకు తెరలేపినట్లు విశ్వాసనీయ సమాచారం. మహానంది దేవస్థానంలో పనిచేసే ఏజెన్సీ ఉద్యోగుల నుండి కాంట్రాక్టర్ ఒకరు అక్రమ వసూళ్ల దందా చేపట్టినట్లు తెలుస్తుంది. ఇటీవల మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులకు గత మూడు నెలల నుంచి విడుదల కావాల్సిన పాత బకాయిలు కొన్ని కారణాలవల్ల చెల్లింపులు ఆగిపోయాయి. మే నెల చివరి వారంలో ఫిబ్రవరి, మార్చి రెండు నెలలకు సంబంధించి మరియు జూన్ మొదటి వారంలో మే నెల కు సంబంధించి మహానంది దేవస్థానం అధికారులు తీసుకున్న చర్యలతో బకాయిలను చెల్లింపులు సంబంధిత ఏజెన్సీ కి బకాయిలను దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బదిలీ చేశారు. అయితే ఇక్కడ త్రికాసు మొదలైనట్లు తెలుస్తుంది. చట్ట ప్రకారం 3% ఏజెన్సీ నిర్వాహకులు కమిషన్ రూపంలో తీసుకోవడంతో పాటు పీఎఫ్ మరియు ఇతర చెల్లింపులు పోను ఏజెన్సీ సిబ్బందికి మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. ఇవి అన్ని పోయినా కూడా మీ యొక్క ఏజెన్సీ 6 నెలలకు ఒకసారి రెన్యువల్ చేయాలంటే రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని వాటి అన్నింటిని ఏజెన్సీ సిబ్బంది భరించాలని ఏజెన్సీ నిర్వాహకులు కుండ బద్దలు కొట్టి చెప్పినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఏజెన్సీ కాంట్రాక్టర్ ఏజెన్సీ సిబ్బందికి సక్రమంగా చెల్లించాల్సిన మొత్తం అక్రమంగా దేవాదాయ శాఖ నుండి కానీ, ఏజెన్సీ సిబ్బంది నుండి కానీ ఎలాంటి అనుమతులు లేకుండా వారి జీతాల్లో ముడుపుల పేరుతో కోత విధించి వారి జీతభత్యాలు ఏజెన్సీ సిబ్బంది ఖాతాల్లోకి జమ చేశారు అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారినట్లు తెలుస్తుంది. దాదాపు 82 మంది ఏజెన్సీ సిబ్బంది మహానంది దేవస్థానంలో పనిచేస్తున్నట్లు సమాచారం. ఫిబ్రవరి మాసం మధ్యలో కొత్తగా చేరిన కొంతమంది వారి 15 రోజుల జీతభత్యాలు మాయమైనట్లు తెలుస్తుంది. నెలకు 30 వేల రూపాయలు ఏజెన్సీ సిబ్బంది జీతాల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం పేరుతో దందా కుశ్రీకారం చుట్టడం పలు విమర్శలకు తావిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతోపాటు ఇటీవల మహానంది దేవస్థానంలో గోవులకు పశుగ్రాసం విక్రయశాల వద్ద భక్తుల నుండి ఏజెన్సీ సిబ్బంది ఒకరు డబ్బులు తీసుకొని రసీదు ఇవ్వకుండా గోవులకు పశు గ్రాసం విక్రయించారని ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రచారం. ఏజెన్సీ ఉద్యోగులకు రావాల్సిన జీతభత్యాల్లో ఏజెన్సీ నిర్వాహకులు కోత విధించి చెల్లింపులు చేపట్టారు అనే అంశం బయటికి పొక్కడంతో ఇప్పటికే ఆలయ అధికారులు ఏజెన్సీ నిర్వాహకులను తీవ్రంగా మందలించినట్లు తెలుస్తుంది. ఏజెన్సీ సిబ్బంది జీతభత్యాల్లో కోతలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అధిపత్య కాంక్షతోనే పాలస్తినా, ఇరాన్ ల పై ఇజ్రాయిల్ యుద్ధం.

## -సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17:**
యుద్ధం వద్దు- శాంతి ముద్దు ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా పై ఇరాన్ లపై చేస్తున్న యుద్ధ దమనకాండ ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సంఘీభావ దినంగా నంద్యాల పట్టణం లోని పద్మావతి నగర్ సెంటర్లో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు జిల్లా నాయకులు పుల్లా. నరసింహ, జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఫక్రుద్దీన్, సిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ నాయకులు చౌడప్ప, రాంబాబు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం,మౌలాలి, సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కమిటీ సభ్యులు గోపాల్ సిపిఎం ప్రజాసంఘాల నాయకులు ఎం. ఆర్.నాయక్, శివలింగం, లతోపాటు వామపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.




అనంతరం వారు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా దేశం పైన యుద్ధం 200 రోజులుగా చేస్తుందని, ఇప్పటికే 55,000 మందికిపైగా చిన్న పిల్లలు, వృద్ధులు, పౌరులు చనిపోయారని, రెండు లక్షల మందికి పైగా అన్ని కోల్పోయి నిరాశ్రయులుగా ఉండిపోయారని, అధిపత్యం కోసం యుద్ధాన్ని చేపట్టి ఇబ్బందులకు ఆ దేశ ప్రజానీకాన్ని గురి చేయడం చాలా దుర్మార్గమని, అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి అమెరికా అండతో ఈ దుశ్చర్యకు పాల్పడం సరైనది కాదని, ఇరు దేశాల మధ్య సయోధ్యతోనే అభివృద్ధి జరుగుతుందని, అలా కాకుండా విధ్వంసం సృష్టిస్తే ఆదేశాల మనగడకే ప్రమాదమని,శాంతి చర్చలతో యుద్ధాన్ని ముగించాలని అన్నారు. అదేవిధంగా ఇరాన్ పైన ఇజ్రాయెల్ యుద్ధం చేయడం ఆ దేశ పౌరులను భయభ్రాంతులకు గురి చేయడం ఆ దేశ ప్రధాని చంపాలి అనే ప్రకటన చేయడం ఇజ్రాయిల్ అధ్యక్షునికి ఎంత దురహంకారమో అర్థమవుతుందని, ఇరదేశాలు సంయమనం పాటించి యుద్ధాన్ని ఆపివేసి ప్రపంచ శాంతిని నెలకొల్పేలా చర్చలు జరపాలని అన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా పైన, ఇరాన్ పైన చేస్తున్న యుద్ధ దమనకాండను ఆపివేయాలని, ప్రపంచ శాంతిని వర్ధిల్లేలా చూడాలని అన్నారు. ఇటీవల భారతదేశంలోని పహాల్గంలో జరిగిన దాడి వలన ఇరుదేశాలు యుద్ధానికి సిద్ధమైతే అమెరికా ఇరుదేశాలు సమయమనం పాటించాలని చర్చలు జరిపి శాంతిని నెలకొల్పినామని చెప్పుకుంటూ ఉందని, అమెరికా అధిపత్యానికి భారతదేశ యుద్ధాన్ని ఆపివేయడం జరిగిందని, అదేవిధంగా ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా పైన ఇరాన్ పైన చేస్తున్న యుద్ధ కార్యకలాపాలు శాంతి చర్చలతో ముగించేలా ప్రయత్నం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎందుకు చేయడం లేదని అన్నారు. ప్రపంచ దేశాలంతా చర్చలతో శాంతిని నెలకొల్పి అభివృద్ధి బాటగా పయనించాలని వామపక్ష పార్టీలుగా కోరుతున్నామని అన్నారు.

# స్వాతంత్ర్యసమరయోధురాలు శ్రీమతి ఝాన్సీలక్ష్మీబాయి సేవలు చిరస్మరణీయం.

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 17:** జూన్ 17 న మన భారత స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగాలి
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో శ్రీమతి ఝాన్సీ లక్ష్మిభాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు వారిని స్మరించుకున్నారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు.శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828 వ సంవత్సరము నవంబరు 19 న జన్మించారు. ఈమె తల్లిదండ్రులు



మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయి. వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. ఆధ్యాత్మిక ధోరణి మెండుగా కలది.ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉండగానే కన్ను మూసింది. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారతదేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీకి రాణిగా ప్రసిద్ధికెక్కినది. 1857 లో భారత దేశ తిరుగుబాటుదార్లలో ముఖ్యమైన వాళ్ళలో రాణి ఒకరు. భారతదేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయిన వీరనారి. ఈమె యుద్ధం లోనె 1858 జూన్ 17 లో వీర స్వర్గం పొందారు. ఝాన్సీ రాణీ ధైర్యసాహసాల వల్ల అనేక మంది మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనుటకు మార్గం చూపిన వీర వనిత. దాని వల్లనే ఆమె భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవడమే కాక 19వ శతాబ్దంలో మహిళా సాధికారతకు ఆదర్శ ప్రాయంగా నిలిచింది.మన దేశ స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలని ప్రతి స్త్రీమూర్తి ఝాన్సీలక్ష్మీభాయి గారిని ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# ట్రంప్ తీరుతో అమెరికాలో అనిశ్చితి

## ఇప్పటికీ తేరుకోలేక పోతున్న భారత విద్యార్థులు

**వాషింగ్టన్జూన్ 17ఆంధ్ర ప్రగతి:**
హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం సంక్షోభంలోకి నెడుతోంది. దీనికితోడు ఏరివేత కార్యక్రమాలు, ఆంక్షలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆందోళనలు వస్తున్నా ట్రంప్ లెక్క చేయడం లేదు. లాస్ఎంజిల్స్ ఆందోళనలను సైన్యంతో అణిచివేయించారు. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి



సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతుల చేపట్టాక ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నారూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

# తెలంగాణలో ఫోన్ ట్యాంపింగ్ అంశంలో మరో మలుపు... షర్మిల ఫోన్ ట్యాప్!

**జూన్ 17ఆంధ్ర ప్రగతి:**
తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా చేరినట్లు తెలుస్తోంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలున్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు



వస్తున్నాయి. అంతేకాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు

## సమీక్షించిన సిఎం చంద్రబాబు



అమరావతి,: సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం యోచన చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం సర్క్యులర్ ఎకానమీపై రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సర్క్యులర్ ఎకానమీ పార్కులపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై సమీక్షలో చర్చించారు. అయితే 'మెటీరియల్ రీసైక్లింగ్కి అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల నుంచి సర్క్యులర్ ఎకానమీ సృష్టించేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్య సాధనకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.

# ఇరాన్తో సంబంధాలు..ఇజ్రాయిల్కు మద్దతా

## కేంద్రం తీరుపై మండిపడ్డ బివి రాఘవులు



విజయవాడ,::ఇరాన్తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయి.. కానీ, ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోందని, ఇదీ దారుణం అని సీపీఎం పొలిట్బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన వివిధ అంశాలపై స్పందించారు.. పెహల్గామ్ లో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలకు వివరించడానికి వారం రోజులు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నాం.. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడిచేసి ధ్వసం చేసింది.. మరి, పాకిస్థాన్, ఇండియా మధ్య యుద్ధం ఆపింది నేనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నాడు.. దీంతో, కేంద్రం ఏదో దాస్తుంది అనే అనుమానం కలుగుతుందన్నారు.. ఇజ్రాయిల్, ఇరాక్ మధ్య యుద్ధాన్ని కూడా ఆపుతామంటూ ట్రంప్ ప్రకటించారని గుర్తుచేశారు.. ఇక, గతంతో ఇందిరా గాంధీ ఎమ్జ్గ÷న్సీని గుర్తు చేసుకోవాలి.. నాటి పరిస్థితికంటే మరింత దారుణమైన పరిస్థితులు ఇప్పుడు వచ్చాయని విమర్శించారు బీవీ రాఘవులు.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్న ఆయన.. ఇరాన్.. ఇజ్రాయిల్పై దాడి చేసింది.. ఈ యుద్ధం తీవ్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బతగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. యుద్ధం నుండి వెనక్కి తగ్గాలని ఇజ్రాయిల్ పై ఒత్తిడి తీసుకుని రావాలని సూచించారు.. ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం అన్నారు.. ఇరాన్ తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తుచేశారు.. ఇజ్రాయిల్ దాడిని భారత్ ఖండించాలి.. ఇప్పటికే 10శాతం క్రూడాయిల్ ధరలు పెరిగాయి.. భారత్ ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అయితే, అమెరికా చెప్పిన విధంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.. పార్లమెంట్ సమావేశాలు వేసి ఈ అంశాలపై చర్చించాలి.. పార్లమెంట్ ముందు ప్రకటన చేయడం అంటే అది ప్రభుత్వ ప్రకటనగా భావిస్తాం.. పార్లమెంట్ మీద ఇంకా నమ్మకం పోలేదన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు కల్పిస్తున్న రక్షణ ఇదేనా

## బాబు సొంత నియోజకవర్గంలోనే సైకోల అరాచకం

## ఎక్స్ వేదికగా జగన్ విమర్శలు



అమరావతి:చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మహిళపై పచ్చ సైకోల అరాచకంపై వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు.. రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? అంటూ ప్రశ్నించారు. కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఇది నిదర్శనం అంటూ ధ్వజమెత్తారు.. 'మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?. సాక్షాత్తూ మీరు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసిస్తున్న ఘటన, మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపలేదు, విడిచిపెట్టలేదు. చంద్రబాబు.., మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి. పొలిటికల్ గవర్నెన్స్, రెడ్బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయం లో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారు. ఈ ఘటనతోపాటు, ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్గా తీసుకోవాలని, చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలి' అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

-------------

# గంభీర్ ఆటగాళ్లను మేనేజ్‌చేయలేకపోతున్నాడు

## మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు




ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శుక్రవారం నుంచి లీడ్స్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తోనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ప్రారంభం కానుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు కోచ్‌గా గంభీర్‌కు ఈ సిరీస్ పరీక్షగా నిలవనుంది. గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినా.. టెస్ట్ క్రికెట్‌లో ఘోర పరాజయాలను చవిచూసింది.గంభీర్ పర్యవేక్షణలో బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ గెలిచిన టీమిండియా.. న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్‌స్వీప్ అయ్యింది. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని 1-3తో కోల్పోయింది. ఈ వరుస పరాజయాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌ను చేజార్చుకుంది. ఈ క్రమంలోనే గంభీర్ కోచింగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి.తాజాగా గంభీర్ కోచింగ్ గురించి మాట్లాడిన టీమిండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వ్యూహాలు రచించడంలో కోచ్‌గా గంభీర్‌కు తిరుగులేదని, కానీ ఆటగాళ్లను సరిగ్గా మేనేజ్‌చేయలేకపోతున్నాడని, ఇదే అతని కోచింగ్‌లో లోపంగా మారిందన్నాడు. ఈ ఒక్క విషయాన్ని గంభీర్ సరిచేసుకోవాల్సిందన్నాడు.'వ్యూహాత్మకంగా గౌతమ్ గంభీర్ చాలా మంచి కోచ్. ఆటగాళ్లను మేనేజ్ చేసే విషయంపై అతను మరింత ఫోకస్ పెట్టాలి. కానీ అతని గురించి చెప్పాల్సిన విషయం ఏంటంటే.. తన ఆటగాళ్ల కోసం ఎదురు చూస్తాడు. అయితే కెప్టెన్‌గా దూకుడుగా ఉన్నట్లు కోచ్‌గా ఉంటానంటే కుదురదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. కోచ్‌గా విభిన్నమైన వ్యక్తులను నడిపించాల్సి ఉంటుంది. వారు మెరుగైన ప్రదర్శన చేస్తారని నమ్మి మైదానంలోకి పంపించాల్సి ఉంటుంది. కోచ్‌గా ఇది అతిపెద్ద సవాల్'అని కార్తీక్ అభిప్రాయపడ్డాడు.ఇప్పటికే జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్న గంభీర్.. సీనియర్ ఆటగాళ్లందర్నీ ఒక్కొక్కరిగా జట్టుకు దూరం చేస్తున్నాడనే విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అతను విజయాలు సాధించకపోతే ఈ విమర్శలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.

# 5 బంతుల్లో 5 వికెట్లు..



## సత్తాచాటిన స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి మరోసారి వార్తల్లోకెక్కాడు. అయితే ఈసారి తన అద్భుత ప్రదర్శనతో వార్తల్లో నిలిచాడు. అతడు 5 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోను లఖ్?నవూ ఓనర్ సంజీవ్ గొయెంకా సోషల్ మీడియాలో షేర్ చేశారు.ఒక స్థానిక టీ20 లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్?లో స్పిన్నర్ దిగ్వేశ్ అదరగొట్టాడు. ఈ లెగ్‌స్పిన్నర్ వరుసగా 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దిగ్వేశ్ స్పిన్ మాయకు నలుగురు బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వగా, ఒక ప్లేయర్ ఎల్?బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్?లో నాలుగు ఓవర్ల తన స్పెల్?లో దిగ్వేశ్ 28 పరుగులిచ్చి మొత్తం 7 వికెట్లు నేలకూల్చాడు.దీంతో దిగ్వేశ్ సూపర్ పర్ఫార్మెన్స్?ను మెచ్చుకుంటూ లఖ్‌నవూ యజమాని సంజీవ్ గోయెంకా అతడి బౌలింగ్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.'స్థానిక టీ20 లీగ్‌లో దిగ్వేశ్ 5 బంతుల్లో 5 వికెట్లు తీసిన వీడియో ఇది. అతడికి ఇలాంటి స్కిల్స్ ఉండడం వల్లే ఐపీఎల్- 18లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున సత్తా చాటి వెలుగులోకి వచ్చాడు' అని గొయెంక రాసుకొచ్చారు. 'దిగ్వేశ్ రాఠి 5 స్టార్స్' అని లఖ్?నవూ సూపర్ జెయింట్స్? సోషల్ మీడియా ఎక్స్?లో ట్వీట్ చేసింది. కాగా, ఇటీవల ముగిసిన ఐపీఎల్?లో దిగ్వేశ్ తన ప్రదర్శనతో కంటే వివాదాలతోనే ఎక్కువగా ఫేమస అయ్యాడు. వికెట్ పడగొట్టిన అనంతం అతడు చేసుకునే సిగ్నేచర్ సెలబ్రేషన్స్? కాంట్రవర్సీ అయ్యింది. దీంతో ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అతడికి మూడుసార్లు ఫైన్ కూడా విధించింది. ఓవరాల్?గా ఈ సీజన్?లో దిగ్వేశ్ 13 మ్యాచ్?ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. 2024లో జరిగిన మెగావేలంలో లెగ్ స్పిన్నర్? దిగ్వేశ్?ను లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది.

# ఇంగ్లండ్‌తో పోరుకు సిద్ధమైన యువ ఆటగాళ్లు

భారత క్రికెట్ జట్టు దాదాపు ప్రతి ఫార్మాట్ ఈ నెల నుండి ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఇందులో ఇండియా సీనియర్, ఇండియా అండర్-19, ఇండియా-%ూ%, మహిళల జట్టు, ఇండియా దివ్యాంగ్ జట్టు ఉన్నాయి. అయితే ఇండియా-%ూ% ప్రయాణం ఇప్పుడు ముగిసింది. జూన్ 20 నుండి ఇండియా సీనియర్ జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత జూన్ 24 నుండి జూలై 23 వరకు జరిగే అండర్-19 జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈ పర్యటనకు స్పెషల్ అట్రాక్షన్ గా వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే. కాగా ఈ పర్యటన కోసం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సోమవారం గాయపడిన ఇద్దరు ఆటగాళ్ల స్థానంలో కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చారు. ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున అద్భుతంగా రాణించిన ఆయుష్ మాత్రే భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడు. గత ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 35 బంతుల్లో సెంచరీతో సహా 252 పరుగులు చేసిన 14 ఏళ్ల పేలుడు



బ్యాట్స్‌మన్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ జట్టులో ఉన్నాడు. గత సంవత్సరం %ఖాజు%లో జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో సూర్యవంశీ, మాత్రే భారత రన్నరప్ జట్టులో కూడా ఉన్నారు. అదే సమయంలో, వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ అభిజ్ఞాన్ కుందును జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ ఇండియా-ఇంగ్లాండ్ అండర్-19 మ్యాచ్ లాఫ్‌బరో విశ్వవిద్యాలయంలో 50 ఓవర్ల ప్రాక్టీస్ మ్యాచ్ అవుతుంది. ఆ తర్వాత హోవ్, నార్తాంప్టన్ , వోర్సెస్టర్‌లలో ఐదు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్ ఉంటుంది. దీని తర్వాత, ఇంగ్లాండ్ అండర్-19తో రెండు మల్టీ-డే మ్యాచ్‌లు వరుసగా బెకెన్‌హామ్, చెల్మ్స్‌ఫోర్డ్‌లో జరుగుతాయి.

**భారత అండర్-19 జట్టు:**

ఆయుష్ మ్హాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ష్ సింగ్, ఆర్ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్, యుధాజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఇనాన్, అన్మోల్జిత్, డిపెప్ప, డిపెప్ప, డిపెప్ప, డిపెప్ప, డి.

**వన్డే సిరీస్ కోసం ఇంగ్లాండ్ అండర్-19 జట్టు**

థామస్ రీవ్ (కెప్టెన్), రాల్ఫీ ఆల్బర్ట్, బెన్ డాకిన్స్, జాడెన్ డెన్లీ, రాకీ ఫ్లింటాఫ్, అలెక్స్ ఫ్రెంచ్, అలెక్స్ గ్రీన్, జాక్ హోమ్, జేమ్స్ ఇస్బెల్, బెన్ మేయెస్, జేమ్స్ మింటో, ఐజాక్ మొహమ్మద్, జోసెఫ్ మూర్స్, సెబ్ మోర్గాన్, అలెక్స్ వేడ్.

# అక్రమ బెట్టింగ్ యాప్ లపై ఈడీ విచారణ

## యాప్ లను ప్రోత్సహించారని క్రికెటర్ల పై దర్యాప్తు



భారతీయ మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా కష్టాల్లో పడినట్లు కనిపిస్తున్నారు. వారి పేర్లు చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడంలో వినిపిస్తున్నాయి. ఈ విషయంలో యువరాజ్, హర్భజన్, రైనా కాకుండా, బాలీవుడ్ నటులు సోనూ సూద్, ఊర్వశి రౌతేలా పేర్లు కూడా వచ్చాయి. ఈడీ ఈ విషయంలో అందరినీ ప్రశ్నిస్తోంది. ఈ విచారణ 1%ఇదీవ్% వంటి నిషేధిత ప్లాట్‌ఫారమ్‌ల ప్రచారానికి సంబంధించినది.ఈ ప్లాట్‌ఫారమ్‌లు ప్రకటనలు, తప్పుడు మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నాయని ఈడీ భావిస్తోంది. 1%ఇఎవ్% వంటి ప్లాట్‌ఫారమ్‌లు సెలబ్రిటీలతో కలిసి పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేస్తున్నాయని ఈడీ చెబుతోంది. నివేదికల ప్రకారం, ఈ ప్లాట్‌ఫారమ్‌లు 1%ఇఎవ్% వంటి పేర్లను ఉపయోగించి ప్రచారం చేస్తున్నాయని ఈడీ విచారణలో తేలింది. ఇటువంటి ప్లాట్‌ఫారమ్‌లు వెబ్ లింక్‌లు, %ు=% కోడ్‌ల ద్వారా వినియోగదారులను అసలైన చట్టవిరుద్ధమైన బెట్టింగ్ సైట్‌లకు పంపే పని చేస్తాయి. ఈడీ ప్రకారం, ఇది భారతీయ చట్టాలను నేరుగా ఉల్లంఘించడమే. ఈ ప్లాట్‌ఫారమ్‌లు తమను నైపుణ్యం ఆధారిత గేమ్‌లుగా చెప్పుకుంటాయని ఈడీ తెలిపింది. కానీ, ఇవి రిగ్డ్ అల్గారిథమ్‌ను ఉపయోగిస్తాయి. దీని కారణంగా ఇవి జూదం పరిధిలోకి వస్తాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై విచారణ జరగడం ఇదే మొదటిసారి కాదు. 2023-24లో ప్రసిద్ధ మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణం, ఇందులో చాలా మంది రాజకీయ నాయకుల పేర్లు వచ్చాయి. మాజీ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ పేరు కూడా ఇందులో ఉంది, ఈ కుంభకోణంలో లబ్ధి పొందారని ఆరోపించారు. బఘేల్ ఆరోపణలను రాజకీయ ప్రేరేపితంగా పేర్కొన్నారు. మహాదేవ్ ప్రమోటర్లు. ప్రస్తుతం దుబాయ్ నుంచి బహిష్కరణను ఎదుర్కొంటున్నారు, వారు ఆపరేషన్‌ను కొనసాగించడానికి అనేక ఫెయిర్‌ప్లే యాప్‌లను తయారు చేశారు. ఈడీ ప్రకారం మహాదేవ్ కేసులో చట్టవిరుద్ధమైన లాభం ?6,000 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

## వైభవ్ ఫ్రెండ్ అయాన్ దుమ్మురేపాడు

ముజ్‌ఫర్‌పూర్ (బిహార్): ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ స్ఫూర్తితో బిహార్‌కే చెందిన మరో చిచ్చరపిడుగు అయాన్ రాజ్ ట్రిపుల్ సెంచరీతో దుమ్మురేపాడు. డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లో సంస్కృతి క్రికెట్ అకాడమీ తరఫున 13 ఏళ్ల అయాన్ కేవలం 134 బంతుల్లో 327 పరుగులు సాధించాడు. అందులో 22 సిక్సర్లు, 41 ఫోర్లు ఉన్నాయి. అయాన్, వైభవ్ మంచి స్నేహితులు. వీరిద్దరూ కలసి ప్రాక్టీస్ కూడా చేసేవారు. 'వైభవ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. అతడి బాటలోనే నేనూ నడుస్తున్నాన'ని అయాన్ చెప్పాడు. రాజ్ తండ్రి కూడా క్రికెటర్ కావడం విశేషం





## మళ్లీ అగ్రపీఠంపై మంధాన

### ఆరేళ్ల తర్వాత టాప్‌లోకి

దుబాయ్: ఐసీసీ మహిళల వ్యక్తిగత వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఆరేళ్ల తర్వాత తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 727 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల ముగిసిన ముక్కోణపు సిరీసలో 52 సగటుతో 264 పరుగులు సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగుపడింది. బ్రంట్ (ఇంగ్లండ్), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) 2, 3 ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగాన్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ (భారత్) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.



## అందుకే కెప్టెన్సీ వద్దన్నా

లండన్: రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో భారత టెస్టు జట్టు పగ్గాలు వైస్‌కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రాకు అప్పగిస్తారని చాలామంది భావించారు. అయితే సెలెక్టర్లు మాత్రం అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. దీంతో బుమ్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న చర్చ మొదలైంది. అయితే పనిఒత్తిడిని తగ్గించుకునేందుకే తాను ఆ బాధ్యతలను వద్దన్నట్టు బుమ్రా చెప్పాడు. 'రోహిత్, విరాట్‌ల రిటైర్మెంట్‌కు ముందే.. ఐపీఎల్ జరుగుతున్నప్పుడే నేను బీసీసీఐతో మాట్లాడా. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో నాపై ఉండే వర్క్‌లోడ్ గురించి వారితో చర్చించా. అలాగే నాకు చికిత్స చేస్తున్న వైద్యుల సలహాలు కూడా తీసుకున్నా. వాస్తవానికి బోర్డు నన్ను కెప్టెన్‌గా చేసేందుకు సిద్ధపడింది. కానీ నేను సిరీస్ మొత్తం ఆడలేను. అలాంటప్పుడు ఒకే సిరీస్‌కు ఇద్దరు కెప్టెన్లు ఉండడం సరికాదు. అందుకే నేనే స్వయంగా ఫోన్ చేసి నాయకత్వ బాధ్యతలు వద్దని చెప్పా. నాకు కెప్టెన్సీ కన్నా క్రికెట్టే ఎక్కువ. ఓ ఆటగాడిగా మరింత సేవ చేసేందుకు ప్రయత్నిస్తాను' అని ఓ ఇంటర్వ్యూలో బుమ్రా వివరించాడు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నన్ను ద్వేషించే వారికి కూడా కృతజ్ఞతలు : అనుపమ



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న విమర్శలు, ట్రోల్స్ గురించి తాజాగా మనసు విప్పారు. తనను ద్వేషించిన వారికి సైతం కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మలయాళంలో తాను నటిస్తున్న 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' (జేవీఎస్కే) చిత్ర ప్రచారంలో భాగంగా ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ థ్రిల్లర్ చిత్రంలో సురేశ్ గోపి కీలకపాత్ర పోషిస్తున్నారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంతో మలయాళ ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటానని అనుపమ ధీమా వ్యక్తం చేశారు.తెలుగులో 'ప్రేమమ్', 'అ ఆ', 'శతమానం భవతి' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైనప్పటికీ, కెరీర్ తొలినాళ్లలో తనకు నటన రాదంటూ పలువురు తీవ్రంగా ట్రోల్ చేశారని అనుపమ గుర్తుచేసుకున్నారు. ఆ మాటలు మొదట్లో బాధపెట్టినా, అవే తనలో పట్టుదల పెంచాయని, నటిగా తనను తాను నిరూపించుకోవాలనే కసిని రగిలించాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో కెరీర్‌పరంగా, వ్యక్తిగతంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు.అయితే, ఈ విమర్శలే తనను తాను మెరుగుపరుచుకోవడానికి, మంచి కథలను ఎంచుకోవడంలో మరింత జాగ్రత్త వహించడానికి దోహదపడ్డాయని అనుపమ వివరించారు. విమర్శల ఫలితంగా తన ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చిందని, ప్రేక్షకులను మెప్పించే బలమైన కథలను మాత్రమే ఎంచుకోవాలని నిశ్చయించుకున్నానని చెప్పారు. ఈ క్రమంలోనే దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తనపై నమ్మకముంచి 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' (జేవీఎస్కే) వంటి అద్భుతమైన చిత్రంలో అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా, తనకు మద్దతుగా నిలిచినవారితో పాటు, తనను ద్వేషించిన వారికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నానని, వారి విమర్శలే తనను మరింత దృఢంగా తీర్చిదిద్దాయని అనుపమ వ్యాఖ్యానించారు.




# కర్ణాటకలో థగ్ లైఫ్ విడుదల చేయాల్సిందే..: సుప్రీంకోర్టు

కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా కర్ణాటకలో విడుదలకు లైన్ క్లియర్ అయింది. సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఉన్నందున, వివాదాలతో సంబంధం లేకుండా కర్ణాటకలో విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఈ రోజు స్పష్టం చేసింది. ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం, 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.కమల్ హాసన్ గతంలో కన్నడ భాషపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ("కన్నడ తమిళం నుండే పుట్టింది") వివాదాస్పదం కావడంతో, 'థగ్ లైఫ్' సినిమాను కర్ణాటకలో విడుదల చేయనీయకుండా కన్నడ సంఘాలు అడ్డుకున్నాయి. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా సినిమాను నిషేధించాలని హెచ్చరించింది. జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు కర్ణాటకలో ప్రదర్శనకు నోచుకోలేదు.ఈ నేపథ్యంలో, సినిమా విడుదలకు భద్రత కల్పించడంలో విఫలమైనందుకు కర్ణాటక ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అనుమతి పొందిన సినిమాను విడుదల చేయాల్సిందే. చట్టబద్ధమైన పాలన ఇదే చెబుతోంది," అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కమల్ హాసన్ క్షమాపణ చెప్పాలని కర్ణాటక హైకోర్టు సూచించడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టింది. "జూన్ 3న హైకోర్టు కమల్ హాసన్‌ను క్షమాపణ చెప్పమని కోరడం సరికాదు," అని పేర్కొంది.తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, కన్నడ భాష పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని కమల్ హాసన్ చెబుతున్నప్పటికీ, క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారు. ఈ కేసును కర్ణాటక హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు తనకు బదిలీ చేసుకుంది. "రాష్ట్రాన్ని అల్లరి మూకలు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారి నియంత్రణలోకి వెళ్లనివ్వలేం" అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గత విచారణలో వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

# పూరి - విజయ్ సేతుపతి -సంయుక్త



యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. 'పాప్‌కార్న్' సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ కేరళ కుట్టి, తెలుగులో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'భీమ్లా నాయక్' చిత్రంతో అడుగుపెట్టింది. ఆ తర్వాత 'బింబిసార', 'సార్', 'విరూపాక్ష' వంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న సంయుక్త, ప్రస్తుతం తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో బిజీగా ఉంది. ఇప్పటికే తెలుగులో 'అఖండ-2', 'స్వయంభు' వంటి ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్న ఈ భామ, తాజాగా మరో క్రేజీ ఆఫర్‌ను అందుకుంది.ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కలయికలో రాబోతున్న ఓ భారీ చిత్రంలో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ బృందం అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు పూరీ జగన్నాథ్ స్వయంగా సంయుక్తకు స్వాగతం పలుకుతూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ ఫొటోను పంచుకున్నారు. "ఆమె అడుగులో దయ, కళ్ళలో ఫైర్ ఉంది" అనే ఆసక్తికరమైన వ్యాఖ్యను ఆ పోస్ట్‌కు జోడించి, సినిమాపై అంచనాలను మరింత పెంచారు.పూరీ జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా కావడంతో ప్రేక్షకులు, సినీ వర్గాల్లో దీనిపై భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ పతాకంపై పూరీ జగన్నాథ్, ఒకప్పటి హీరోయిన్ చార్మీ కౌర్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటి టబు, విలక్షణ నటి రాధికా ఆప్టే కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. కాగా, ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ, దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# మళ్లీ వస్తున్న 'హనుమాన్ జంక్షన్'



2001లో విడుదలైన హనుమాన్ జంక్షన్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించింది. యాక్షన్, అద్భుతమైన హాస్యం మేళవించిన ఈ సినిమాలో అర్జున్, జగపతి బాబు, వేణు ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రముఖ దర్శకుడు మోహన్ రాజా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆయన తరువాత తమిళ జయం, తనీ ఒరువన్, గాడ్‌ఫాదర్ వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించారు. లయ, స్నేహ, విజయలక్ష్మి కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో బ్రహ్మానందం, కోవై సరళ, అలీ, ఎల్.బి. శ్రీరామ్, ఎం.ఎస్. నారాయణ,వేణు మాధవ్ వంటి ప్రముఖులు హాస్య పాత్రలతో ప్రేక్షకులను అలరించారు. ఎడిటర్ మోహన్ స్థాపించిన ఎం.ఎల్. మూవీ ఆర్ట్ బ్యానర్‌పై ఎం.వి. లక్ష్మి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఎంగేజింగ్ స్క్రీన్‌ప్లే, ఆకట్టుకునే సంభాషణలు, కామెడీ, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు కల్ట్ స్టేటస్‌ను తీసుకువచ్చాయి. ఇప్పుడు ఈ ఎవర్ గ్రీన్ ఎంటర్‌టైనర్ మళ్లీ ప్రేక్షకులను థియేటర్లో అలరించబోతోంది. హనుమాన్ జంక్షన్ ను జూన్ 28న మళ్లీ థియేటర్లలో విడుదల చేయనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది.

# పాత పరిచయాలతో మళ్లీ ప్రయత్నాలా?



పూజాహెగ్డే కోలీవుడ్ లో కంబ్యాక్ అయిన సంగతి తెలిసిందే. 'రెట్రో' సినిమాతో అమ్మడు మళ్లీ రీలాంచ్ అయింది. కానీ ఆ సినిమా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. సక్సెస్ తో కంబ్యాక్ అవ్వాలనుకున్న పూజకు అలా షాక్ తగిలింది. ప్రస్తుతం అక్కడే విజయ్ హీరోగా నటిస్తన్న %-%జననాయగన్%-% లో నటిస్తోంది.తాజాగా ఈ సినిమాలో అమ్మడి పోర్షన్ పూర్తయింది. ప్రస్తుతం %-%కాంచన 4%-% లో నటిస్తుంది. ఇది కూడా పూర్తయితే పూజా అక్కడ ఖాళీ అయిటన్లే. కొత్త సినిమాలేవి చేతిలో లేవు. సూపర్ స్టార్ రజనీ కాంత్ నటిస్తోన్న కూలీలో స్పెషల్ అప్పిరియన్స్ మాత్రమే ఇస్తుంది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్ అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. పాత పరిచయాల్ని మళ్లీ టచ్ లో పెడు తోందిట. పాత మేనేజనర్లకు టచ్ లోకి వెళ్లి యోగక్షేమాలు అడిగి ఇండస్ట్రీ స్థితి గతల గురించి ఆరా తీస్తుందిట. %ూశ్రీంశీ =ముఃస% - పుష్పరాజ్ గా మహేష్.. నెట్టింట వైరల్ అవుతున్న వీడియో అలాగే కొంత మంది దర్శక, నిర్మాతలకు కూడా టచ్ లో వెళ్లినట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. మరి ఈ పాత పరిచయాలు కొత్త అవకాశాలు తెచ్చి పెడతాయా? లేదా? అన్నది చూడాలి. పూజాహెగ్డే టాలీవుడ్ ను వదిలేసి మూడేళ్ల అవుతుందిఆచార్య తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు. అప్పటికీ కొంత మంది స్టార్స్ తో అవకాశాలు వచ్చినా? వాటిని కాదని బాలీవుడ్ కి వెళ్లింది. కెరీర్ అక్కడే ప్లాన్ చేసుకుని స్థిరపడాలని ప్లాన్ చేసుకుంది. కానీ అమ్మడి ప్లానింగ్ తల్లకిందులైంది. అక్కడ సరైన సక్సెస్ లు పకడపోవడంతో వెంటనే కోలీవుడ్ వైపు టర్న్ తీసుకుంది. లక్కీగా ఆ సయంలో అవ కాశాలు రావడంతో చేతిలో ఈ మాత్రం సినిమాలతోనైనా బిజీగా ఉంది. లేదంటే పూజాహెగ్డే రిటైర్మెంట్ ప్రచారం తెరపైకి వచ్చేది.

# యూనిక్ కాన్సెప్ట్‌తో సినిమా ప్రారంభం




%కలర్ ఫోటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ వంటి హిట్లతో హీరో సుహాస్ తనదైన ముద్ర వేశారు. ఆయన కొత్త చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ గోపి అచ్చర దర్శకత్వం వహిస్తున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి నరేంద్ర రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రం ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో కూడిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. రైటర్ పద్మభూషణ్ తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందించారు. ఈ చిత్రం పూజా కార్యక్రమంతో గ్రాండ్ గా ప్రారంభమైంది. చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో దర్శకుడు నాగ్ అశ్విన్, హీరో సత్యదేవ్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు.ముహూర్తం షాట్ కు సత్యదేవ్ కెమెరా స్విచ్చా న్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. వంశీ నందిపాటి ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ క్యారెక్టర్ పోషించనున్నారు. గతంలో ఆయనతో కలిసి నటించిన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ ఫేం శివాని నగరం ఈ చిత్రంలో హీరోయి న్‌గా నటిస్తున్నారు. నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది.